క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి ఆలయం హుండీలో డిసెంబర్ నెలలో భక్తులు వేసిన విరాళాల ఆదాయాన్ని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బుధవారం సాయంత్రం లెక్కించారు. రూ. 14,680 ఆదాయం వచ్చినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంకల సోమేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు జగదీష్ పట్నాయక్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న చర్చి సభ్యులు

టెక్కలి: నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం స్థానిక సెంటినరీ ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పాస్టర్ ఆర్.అప్పాజీ, సంఘం ప్రతినిధులు ఎన్.సురేష్‌కుమార్, పులి డేనియల్ వినోద్, సిహెచ్.రవి, కె.సురేష్ పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష తదితరులు

పలాస: వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం శాసనాం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫార్మాసిస్టులు ఏమాత్రం అశ్రద్ధ వహించినా రోగులకు చాలా ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనెల గోపాల్, రెంటికోట వైద్యాధికారి సునీల్‌కుమార్, డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్‌వైజర్ రిషికేశ్వరరావు, కామేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, సప్ప నవీన్‌కుమార్, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, గురిటి సూర్యనారాయణ, అనిల్ శర్మ ఉన్నారు.

పాఠశాలలో రక్తదాన శిబిరం

కాశీబుగ్గ: పలాసలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ స్కూల్‌లో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. స్కూల్ కరెస్పాండంట్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు 25 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రాణదాత బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీసాయి మహంతి, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, వైస్ ప్రెసిడెంట్ తాళాసు శ్రీను పాల్గొన్నారు.

కేశుపురంలో రక్త పరీక్షలు

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం పంచాయతీలో 'ద జార్జ్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్' వైద్య సిబ్బంది బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ వ్యాధులకు సంబంధించి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది దుద్ది జ్యోతి, భగీరథ బిసాయిలు తెలిపారు.

జోరుగా రోడ్డు మరమ్మతులు



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ఉన్నత పాఠశాల నుంచి పూండి బస్టాండ్ మూడు రోడ్లు కూడలి వరకు రహదారి మరమ్మతులు జోరుగా జరుగుతున్నాయి. శిథిలమైన రోడ్డుకు సుమారు రూ. 15 లక్షలు వెచ్చించి బీటీతో బాగు చేస్తున్నారు.

మంచు దుప్పటి



ఇచ్ఛాపురం రూరల్: పొలాలను కప్పేసిన మంచు

పొగమంచు ఉద్దానం ప్రాంతాన్ని బుధవారం దట్టంగా కమ్మేసింది. తెల్లవారుజాము నుంచే బీభత్సంగా కురవడంతో రోడ్లు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఉదయాన్నే నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవాలని భావించిన వారిపై మంచు ప్రభావం చూపింది. ఉదయం సుమారు తొమ్మిది గంటల వరకూ సూర్యుడు జనానికి కనిపించలేదు. – ఇచ్ఛాపురం రూరల్, కంచిలి



కంచిలి: రహదారిని కమ్మేసిన పొగమంచు

కస్టమ్స్ హైరింగ్ కేంద్రాలకు మంగళం!

- గతంలో టెక్కలి నియోజవర్గంలో 84 సెంటర్లు
- కొత్త సెంటర్లు, పరికరాల ఊసెత్తని ప్రభుత్వం



సీహెచ్‌సీలకు అందజేస్తున్న యంత్ర పరికరాలు (ఫైల్)



సీహెచ్‌సీ ద్వారా అందజేసిన ట్రాక్టర్

నందిగాం: రైతులకు అండగా ఉంటామని.. ఆదుకుంటామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాస్తవం రూపంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందించే కస్టమ్స్ హైరింగ్ సెంటర్లకు ఎలాంటి తోడ్పాటు అందించడం లేదు. గ్రామాల్లో ఉన్న ఆయా కేంద్రాలకు కొత్త వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సైతం అందించని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి భారం తగ్గించే విధంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల సహాయంతో వ్యవసాయం చేసుకునేలా యంత్ర పరికరాలను రాయితీపై అందించి, రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా గ్రామాల్లో రైతులను సభ్యులుగా చేర్చి సంఘాలుగా ఏర్పాటు చేసి వాటిని కస్టమ్ హైరింగ్ సెంటర్లుగా నెలకొల్పారు. ఈ కేంద్రాలకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో, 60 శాతం బ్యాంకు రుణం ఇప్పించి వ్యవసాయ పరికరాలను అందించారు. యంత్ర పరికరాల్లో భాగంగా ట్రాక్టర్లు, నూర్పు యంత్రాలు, రోటోవేటర్లు, దుక్కిసెట్లు, పవర్‌టిల్లర్లు, రేపర్లు, పరదాలు వంటివి అందజేశారు. ఈ పరికరాలను సంఘం పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి, సంఘ సభ్యుల తీర్మానం మేరకు సంఘ సభ్యులతో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయాన్ని ఈ యంత్ర పరికరాలను తక్కువ ఖర్చుతో వినియోగించుకుని వ్యవసాయంగా చేసుకునేవారు. దీంతో రైతులకు కూలీల కొరత తీరడమే కాకుండా పెట్టుబడి ఖర్చు తగ్గేది. టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో రైతు సేవా కేంద్రాలను యూనిట్‌గా తీసుకొని 84 కస్టమ్స్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 79 ట్రాక్టర్లతో పాటు మిగతా యంత్ర పరికరాలను అందించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెటుబడి సాయం అందంచకపోవడమే కాకుండా వారికి మేలు చేస్తున్న ఈ సీహెచ్‌సీలకు తగిన తోడ్పాటు అందించక పోవడంతో కొత్త సెంటర్లు ఏర్పాటుకు నోచుకోవడం లేదు. అలాగే రైతులకు మరిన్ని యంత్ర పరికరాలు ఈ కేంద్రాల ద్వారా అందుబాటులోని తీసుకురాకపోవడం శోచనీయం. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గమైన టెక్కలిలో మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసి, మరిన్ని యంత్ర పరికరాలు రాయితీపై అందజేసి రైతులకు మేలు చేయాలని పలువురు రైతులకు కోరుచున్నారు.

యంత్ర పరికరాలతో మేలు జరిగింది



గత ప్రభుత్వంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా అందించిన వివిధ యంత్ర పరికరాలు, ట్రాక్టర్‌తో రైతులకు మేలు జరిగింది. తక్కువ ఖర్చుతో ఈ పరికరాలను వాటుకున్నాం. దీనివల్ల కొంత మేర పెట్టుబడి తగ్గింది.

– అట్టాడ క్రిష్టారావు, రైతు దిమిలాడ

యంత్ర పరికరాలు అందించాలి



వ్యవసాయానికి పెట్టుబడి పెరిగి పోతున్న ప్రస్తుత రోజుల్లో యంత్ర పరికరాలతో వ్యవసాయం చేయడం వలన ఖర్చు తగ్గుతుంది. కనుక ప్రభుత్వం రైతులకు మరిన్ని యంత్రాలు, పరికరాలు అందించాలి.

– ప్రగడ ఈశ్వరరావు, రైతు, నందిగాం

పండుగలోగా అందజేస్తాం

రైతులకు కొత్త యంత్ర పరికరాల కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.180 కోట్లు కేటాయించింది. మండలానికి 5 ట్రాక్టర్లు, 10 నూర్పు యంత్రాలు, 2500 టార్పాన్లు.. తదితర పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాం. పండుగలోగా యంత్ర పరికరాలు అందించే అవకాశం ఉంది. అలాగే గతంతో అందించిన ట్రాక్టర్లు ఆయా రైతుల వద్దే ఉన్నాయి. వాటిని వినియోగిస్తున్నారు.

– తిరుమలరావు, ఏడీ, వ్యవసాయశాఖ, టెక్కలి

టెక్కలిలో భీమా కోరేగావ్ విజయోత్సవ దివస్



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమతా సైనిక్ దళ్ కార్యకర్తలు

టెక్కలి: బానిసత్వం విముక్తి కోసం చేసిన పోరాటమే భీమాకోరేగావ్ అని సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో భీమా కోరేగావ్ విజయోత్సవ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1818 జనవరి ఒకటో తేదీన మహారాష్ట్రాలో సుమారు 500 మంది దళితుల బానిసత్వ సంకెళ్లను తెంచుకోవడానికి పీష్వాలతో చేసిన భీకర పోరాటంలో సాధించిన విజయగాథ ప్రతీ ఒక్కరిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిందని అన్నారు. పీష్వాల చేతిలో తీవ్రమైన అణచివేతకు గురైన దళితులు తిరుగుబాటు చేసి విజయం సాధించారని దానికి ప్రతీకగా ఏటా జనవరి ఒకటో తేదీన విజయోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రామారావు వివరించారు. కార్యక్రమంలో పి.ఆదమ్‌కుమార్, డి.నాగేశ్వరరావు, మాధవరావు, శేఖర్, లక్ష్మి, నారాయణ, సీతారామ్, సూర్య, అప్పారావు, పాపారావు, రాములు ఉన్నారు.

రోడ్డు ప్రారంభం

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సముద్ర తీరం వరకు రూ. 90 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. డీఈ రవిబాబు, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఏఈ నాగభూషణ్, మాజీ సర్పంచ్ అంబటి రామక్రిష్ణ, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల అధ్యక్షుడు సురాడ మోహన్‌రావు, కర్ని రమణ, పాల్గొన్నారు.

బోర్డుతో తికమక..



టెక్కలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకి సంబంధించి హైవే సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డు తికమకకు గురిచేస్తోంది. కళాశాల ఒక దగ్గర.. బోర్డు మరో దగ్గర ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్టాండ్ వద్ద కళాశాల ఉండగా దానికి కిలోమీటర్ దూరంలో ఉన్న పాతజాతీయ రహదారిలో బోర్డు ఏర్పాటు చేయడం సమస్యగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి బోర్డును కళాశాలకు సమీపంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – టెక్కలి రూరల్

అండర్ పాసేజ్‌తో అవస్థలు



వజ్రపుకొత్తూరు: మండలం పూండి రైల్వేస్టేషన్‌కు సమీపంలో నిర్మించిన అండర్ పాసేజ్‌తో ప్రయాణీకులకు అవస్థలు తప్పడం లేదు. సుమారు రూ. రెండు కోట్లతో నిర్మించిన అండర్ పాసేజ్ పైకప్పు (టాప్) నిర్మించకపోవడంతో వర్షం పడితే నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల కిందట నిర్మించి ప్రాంభించిన అండర్ పాసేజ్ పైకప్పు నిర్మించకపోవడంతో సీసీ రహదారి సైతం శిథిలమైంది. పైకప్పు తక్షణమే నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు. – వజ్రపుకొత్తూరు

పొంచిఉన్న ప్రమాదం..



టెక్కలి మండలంలో మేఘవరం పంచాయతీ పరిధి జక్కరపేట గ్రామ సమీపంలో రహదారిపై ఉన్న మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. టెక్కలి నుంచి భీంపురం వైపు వెళ్లే వాహనాలు అతివేగంగా వెళ్తున్న సమయంలో ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లతోపాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – టెక్కలి రూరల్

కంకర పోగులతో ఇబ్బంది..



కంచిలి మండలంలోని జలంత్రకోట గ్రామ కూడలి వద్ద రోడ్డు పక్కన కంకర పోగులు వేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన షాపులు ముందు కంకర పోగులు వేయడంతో రాత్రిపూట జాతీయ రహదారి నుంచి ఈ కూడలి వైపు వెళ్లే వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురౌతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కల్పించుకొని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – కంచిలి

ఊరూరా 'నూతన' సందడి

నూతన సంవత్సరం ప్రారంభ వేడుకలు ఊరూరా ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత వయసుతో సంబంధం లేకుండా అందరూ రోడ్లపైకి వచ్చి బాణసంచా కాలుస్తూ. ఒకరికొకరు హ్యాపీ న్యూఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సందడి చేశారు. కేక్‌లు కట్‌చేసి పంచుకున్నారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ముందు రంగవల్లికలు వేశారు. బుధవారం ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ఏడాదంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. పలువురు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు, ప్రజాప్రతినిధులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌కు శుభాకాంక్షలు చెబుతూ కేక్‌కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



టెక్కలి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు



టెక్కలిలో వేడుకలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి



కవిటి: బల్లిపుట్టుగలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయకు శుభాకాంక్షలు చెబుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



కవిటి: కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు



కవిటి: శిలగాంలో ఎంపీపీ కడియాల పద్మ, ప్రకాష్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, కార్యాలయ సిబ్బంది



కంచిలి: జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, కృష్ణారావు దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



సోంపేట: ఎంపీపీ నిమ్మన దాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు



ఇచ్ఛాపురం: మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కమిషనర్ ఎన్.రమేష్



పలాస: వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వాడ శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ శ్రేణులు



కంచిలి: మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా (లల్లూ)కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నేతలు



కంచిలి: ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ఉపాధ్యాయులు



వజ్రపుకొత్తూరు: పూండిలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు



టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకల్లో డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు



కాశీబుగ్గ: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



టెక్కలి: నిమ్మాడలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, జేసీ ఫర్మాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: ఎంపీపీ బోర పుష్పకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది



కవిటి:రామయ్యపుట్టుగలో ప్రభుత్వ విప్ బి.అశోక్ నూతన సంవత్సర వేడుకల సందడి



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు హంగీర్ బెహరా



కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు



కంచిలి: చంద్రపుట్టుగలో వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రధాన లజపతి